

అగ్రిమెంట్‌కు మించి..

టీజీ ఎన్పీడీసీఎల్‌లో అక్రమాలు, అవకతవకల పరంపర కొనసాగుతోంది. ఒక చోట కాకుంటే మరో చోట అవి వెలుగుచూస్తూనే ఉన్నాయి.

- 10లో▸



హోరాహోరీగా క్రికెట్ పోటీలు

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అండర్‌-23 లీగ్ కమ్ నాకౌట్ అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగాయి.

- 10లో▸

గరిష్టం/కనిష్టం
$31^0/20^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి సమయంలో చలి తీవ్రత కాస్త పెరుగుతుంది.

న్యూస్‌రీల్

శ్రీచండిక అమ్మవారికి బంగారు పుస్తెలతాడు



పాలకుర్తి టౌన్: శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలోని చండిక అమ్మవారికి బుధవారం బంగారు పుస్తెలతాడును మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం దాట్ల గ్రామానికి చెందిన భక్తులు సమర్పించినట్లు ఆలయ ఈఓ సల్వాది మోహన్‌బాబు తెలిపారు. గోలి వెంకన్న, సుజాత, గోలి అరవింద్, భానుప్రియ, చల్లా మనోహర్, భవాని కుటుంబ సభ్యులు రూ.2.20 లక్షల విలువైన 29.540 గ్రాముల బంగారు పుస్తెలతాడు చేయించి బహూకరించినట్లు పేర్కొన్నారు. పూజ చేసి అమ్మవారికి అలంకరించినట్లు ఈఓ తెలిపారు.

వేలం ఆదాయం రూ.31 లక్షలు



పాలకుర్తి టౌన్: శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో 2024–25 ఆర్థిక సంవత్సరం కొబ్బరికాయలు, పూజా ద్రవ్యాల విక్రయం, (అభిషేకం, వాహన పూజ సామగ్రి మినహా), కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కు కోసం బుధవారం వేలం నిర్వహించారు. వేలం ద్వారా రూ.31,05,000 ఆదాయం వచ్చినట్లు ఈఓ సల్వాది మోహన్‌బాబు తెలిపారు. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం మాలిపురానికి చెందిన వందన సోమయ్య కొబ్బరికాయలు, పూజా ద్రవ్యాల విక్రయ హక్కు, పాలకుర్తికి చెందిన రంప నరేందర్ కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కు దక్కించుకున్నట్లు చెప్పారు. తలనీలాల వేలానికి సరైన పాట రాక వాయిదా వేశామన్నారు.

బెస్ట్ ఫార్మర్ సర్టిఫికెట్ అందుకున్న రాజేశ్వర్‌రెడ్డి




చిల్పూరు: మల్కాపూర్‌కు చెందిన కర్షక నేస్తం.. మీఆలోచన కేశిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి బెస్ట్ ఫార్మర్ సర్టిఫికెట్ అందుకున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంలోని వ్యవసాయ క్షేత్రంలో రెండు రోజుల పాటు సేంద్రియ వ్యవసాయంపై నిర్వహించిన అవగాహన సదస్సులో రాజేశ్వర్‌రెడ్డి ప్రకృతి వ్యవసాయంపై ప్రసంగించారు. ఇందుకుగాను కాకతీయ, నాగ్‌పూర్ యూనివర్సిటీల ప్రొఫెసర్లు ఈ సర్టిఫికెట్ ప్రదానం చేశారు.

రచనను విధుల్లోకి తీసుకోవాలి

జనగామ రూరల్: డీఎస్సీ–2024 అధికారుల తప్పిదానికి నష్టపోయిన రచనను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శాగ కైలాసం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దళిత మహిళా టీచర్ ఎంతో కష్టపడి డీఎస్సీలో రెండు ఉద్యోగాలు సాధిస్తే నేడు ఉద్యోగం లేదనడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఇందుకు బాధ్యులను సస్పెండ్ చేసి రచనకు పోస్టింగ్ ఇవ్వకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్యానికి ముప్పు



జనగామ రూరల్ : జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్యానికి ముప్పు అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ.అబ్బాస్ అన్నారు. ఎర్రగొల్లపహాడ్‌లో బుధవారం జరిగిన సీపీఎం జనగామ మండల మహాసభలో మైలారం వెంకటయ్య జెండా ఆవిష్కరించారు. అనంతరం పోత్కనూరి ఉపేందర్, రామవత్ మీట్యా నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అబ్బాస్ మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం దేశంలో జమిలి ఎన్నికలు తేవాలని చూస్తున్నదని, దీనివల్ల డబ్బులు ఉన్నవాళ్లే ఎన్నికల్లో పోటీచేసే పరిస్థితి ఉంటుందన్నారు. రాష్ట్రాలు హక్కులు కోల్పోయే ప్రమాదం ఉందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, సాంబరాజు యాదగిరి, బోడ నరేందర్, బూడిద గోపి, సుంచు విజేందర్, జోగు ప్రకాష్, గ్రామ శాఖ బైరగోని మల్లేష్, కార్యదర్శి గుండెల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన కొనుగోళ్లు

- 20 శాతం సెంటర్లలో మొదలే కాలేదు
- టార్పాలిన్లు.. ప్యాడీ క్లీనర్ల కొరత
- వెలగని బల్బులు .. రాత్రి అంధకారం
- 996 మంది రైతుల నుంచి 57వేల క్వింటాళ్ల ధాన్యం సేకరణ



ఇప్పగూడెం సెంటర్‌లో పేరుకుపోయిన ధాన్యం నిల్వలు

జనగామ: వానాకాలం ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయి. కేంద్రాలను ప్రారంభించినా కొనుగోళ్లు జరగడం లేదు. మద్దతు ధరకు ఆశపడి సెంటర్లకు వచ్చిన రైతులు ధాన్యం ఆరబోసుకుంటూ రోజుల తరబడి నిరీక్షిస్తున్నారు. కనీస మౌలిక వసతుల కల్పనలో అలసత్వం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. రాత్రి సమయంలో పలు కేంద్రాల ఆవరణలో బల్బులు వెలగక పోవడంతో అంధకారం అములుకుంది. టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్ల కొరత కారణంగా అత్యవసర సమయంలో రైతులకు కష్టాలు తప్పడం లేదు. జిల్లా వ్యాప్తంగా ఐకేపీ, పీఏసీఎస్ 181 సెంటర్లు(97 సన్న రకం) ఏర్పాటు చేయగా, ఇందులో జఫర్‌గఢ్‌లో ఒక సెంటర్ ప్రారంభించాల్సి ఉంది.

57వేల క్వింటాళ్ల కొనుగోళ్లు

జిల్లాలో ఏర్పాటు చేసిన ధాన్యం సేకరణ కేంద్రాల్లో ఇంకా 20 శాతం సెంటర్లలో కొనుగోళ్లు మొదలు కాలేదు. ఇప్పటి వరకు 996 మంది రైతుల నుంచి దొడ్డు, సన్నరకం కలుపుకుని 57,194 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు. జిల్లాలో 51 రైస్ మిల్లులు ఉండగా.. ఇప్పటి వరకు 30 బాయిల్డ్, రారైస్ మిల్లులకు 48,037 క్వింటాళ్ల ధాన్యం సీఎంఆర్ కోసం పంపించారు. మిగతా మిల్లులకు సంబంధించి 10 శాతం గ్యారంటీపై కలెక్టర్ నేతృత్వంలో చర్చలు జరుపుతున్నారు.

తప్పని ఇబ్బందులు

జిల్లాలో 20 శాతానికి పైగా సెంటర్లలో కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడంతో రైతులు రోజుల తరబడి నిరీక్షిస్తూ ఇబ్బంది పడుతున్నారు. ఒక వైపు తేమ శాతం పేరిట కాలయాపన చేస్తుండగా.. మరోవైపు ప్రభుత్వం ఇచ్చే టార్పాలిన్ కవర్లు సరిపోక రైతులు సొంతంగా తెచ్చుకుంటున్నారు. అలాగే మిల్లర్లు పూర్తి స్థాయిలో బ్యాంకు గ్యారంటీ ఇవ్వక పోవడం కొనుగోళ్లు ఆలస్యం కావడానికి కారణంగా చెప్పుకోవచ్చు.

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

- కలెక్టర్ రిజ్వాన్ బాషా



పాలకుర్తిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

పాలకుర్తి టౌన్: ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం మండల పరిధి ఈరవెన్ను, తొర్రూరు గ్రామాలు, పాలకుర్తిలో ఏర్పాటు చేసిన ధాన్యం కేంద్రాలను ఆయన సందర్శించారు. ధాన్యంలో తేమ 17 శాతానికి మించొద్దని రైతులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో దళారులు లేకుండా చూడాలని, ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతుల అకౌంట్లో డబ్బులు జమ చేయాలని నిర్వాహకులకు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.శ్రీనివాస్, తొర్రూరు సొసైటీ చైర్మన్ గోనె మైసిరెడ్డి, ఆర్‌ఐ రాకేష్, ఎండీ సత్యనారాయణరెడ్డి, రణధీర్, ఏఈఓలు రాధిక, దీపక్, కీర్తి, స్నేహ పాల్గొన్నారు.

పరదాలు కూడా ఇస్తలేరు..



గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రానికి ఎనిమిది రోజుల క్రితం 80 బస్తాల ధాన్యం తీసుకువచ్చాను. తేమ ఉందనడంతో సెంటర్‌లోనే ఆరబోసిన. ఇక్కడ కల్లం సరిగ్గా లేక ధాన్యం మట్టిలో కలిసి పోతోంది. పరదాలు అడిగితే ఇస్తలేరు. రోజూ తేమ పేరుతో జాప్యం చేస్తున్నారు. పెద్ద సార్లు స్పందించి కొనుగోళ్లు చేయించాలి.

\- గొడిశాల సుగుణ, రైతు, ఇప్పగూడెం

విద్యుత్ సౌకర్యం లేక ఇబ్బందులు



మార్కెట్ యార్డులో ఐకేపీ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో విద్యుత్ సౌకర్యం లేక రాత్రి సమయంలో అంధకారంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్నది. అలాగే రెండు కేంద్రాలకు కలిపి మూడు ప్యాడీ క్లీనర్లు మాత్రమే ఉండడంతో అవి సరిపోక రైతులు నానా పాట్లు పడుతున్నారు.

\- దండంపెల్లి సోమయ్య, కొడకండ్ల సెంటర్ ఇన్‌చార్జ్

వారం రోజులుగా నిరీక్షణ



ఎకరం పొలంలో వరి సాగు చేసిన. సుమారు 60 బస్తాల దిగుబడి వచ్చింది. మద్దతు ధరకు ఆశపడి ధాన్యాన్ని వారం రోజుల క్రితం ఐకేపీ సెంటర్‌కు తీసుకు వచ్చాను. రోజూ ఆరబోస్తున్నాను. ఇప్పటి వరకు గింజలు కొనుగోలు చేయడం లేదు.

\- ఎర్ర కనకయ్య, బచ్చన్నపేట

న్యాయం చేయాలంటూ రాస్తారోకో

- వైన్‌షాపుల ఎదుట మృతురాలి కుటుంబం, బంధువుల ఆందోళన



వైన్ షాపుల ఎదుట ఆందోళన చేస్తున్న మృతురాలి కుటుంబ సభ్యులు

జఫర్‌గఢ్ : న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని మద్యం దుకాణాల ఎదుట బంధువులు, గ్రామస్తుతో కలసి మృతురాలి కుటుంబ సభ్యులు బుధవారం ఆందోళనకు దిగారు. ఈ నెల 5న మద్యం లోడ్‌తో వెళ్తున్న ఆటో.. బైక్‌ను ఢీకొట్టగా మహిళ మృతి చెందిన విషయం తెలిసిందే. ఆటో డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని మృతురాలి కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

జఫర్‌గఢ్ శివారు వడ్డెగూడెంకు చెందిన బండ్ల యేసుమణి బ్యాంకులో పని నిమిత్తం కుమారుడితో కలిసి స్టేషన్‌ఘన్‌పూర్‌కు బైక్‌పై మంగళవారం బయలు దేరింది. మండల కేంద్రం శివారు దాటాక ముందే వెనుక నుంచి బెల్ట్ దుకాణాలకు మద్యం తరలించే ఆటో ఢీకొట్టింది. యేసుమణి కిందపడడంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. బైక్ నడుపుతున్న మృతురాలి కుమారుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈఘటనకు సంబంధించి కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. న్యాయం చేయాలంటూ బాధిత కుటుంబ సభ్యులు అడ్డుకోవడంలో పోస్టుమార్టం ఆలస్యమైంది. తిరిగి బుధవారం జఫర్‌గఢ్‌కు చేరుకుని స్థానిక వైన్ షాపుల ఎదుట ప్రధాన రహదారిపై బైఠాయించడంతో వాహనాలు నిలిచిపోయాయి. ఎస్సై రామ్‌చరణ్ చేరుకునని నచ్చ జెప్పే ప్రయత్నం చేశారు. పలువురు మధ్యవర్తులు జోక్యం చేసుకుని న్యాయం చేస్తామని లిఖితపూర్వకంగా హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఆందోళన నేపథ్యంలో మద్యం దుకాణ యజమానులు షాపులను ముందుగానే మూసి వెళ్లి పోయారు. మహిళ మృతికి కారుకుడైన ఆటో డ్రైవర్ వంశీపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి.. అతడిని అదుపులోకి తీసుకుని.. ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

కల్లుగీత కార్మికులను ఆదుకోవాలి

- కేజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రమణ



సమావేశంలో మాట్లాడుతున్న రమణ

జనగామ రూరల్: ప్రభుత్వం కల్లుగీత కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేసి వారిని ఆదుకోవాలని కేజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ.రమణ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కుర్ర ఉప్పలయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఐదు లక్షల కుటుంబాలు కల్లుగీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాయని, ప్రమాదాల్లో వందలాదిమంది క్షతగాత్రులవుతున్నారని, అలాగే చనిపోతున్నారని చెప్పారు. చనిపోయిన వారి కుటుంబాలకు, శాశ్వత వికలాంగులకు రూ.10 లక్షలు, తాత్కాలిక వికలాంగులకు రూ.లక్ష చొప్పున ఎక్స్‌గ్రేషియా నెలరోజుల లోపు ఇవ్వాన్నారు. మెడికల్ బోర్డు విధానం తొలగించి బెల్టు షాపులను పూర్తిగా నిషేధించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు కమ్మగాని నాగన్న, కనకటి రాజయ్య, భాస్కర్, శ్రీనివాస్, వెంకటేష్, మహేందర్, మార్క ఉపేందర్, భీమగోని శ్రీధర్, శంకరయ్య, కొండయ్య పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- సీనియర్ సివిల్ జడ్జి విక్రమ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి విక్రమ్

జనగామ రూరల్: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్ అన్నారు. బుధవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో ట్రాన్స్ జెండర్స్, సెక్స్ వర్కర్లకు ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు, బాధ్యతల గురించి వివరించారు. అలాగే ట్రాన్స్ జెండర్స్, సెక్స్ వర్కర్స్ బాధలు, కష్టాల గురించి తెలుసుకున్నారు. చదువుకు తగిన ఉద్యోగం దొరికితే గౌరవంగా జీవిస్తామని, అడుక్కోవడం మానేస్తామని వారు తెలిపారు. గౌరవప్రదంగా జీవించటానికి వారికి ఉన్న సమస్యలను రాష్ట్ర న్యాయ సేవా అధికారి సంస్థ దృష్టికి తీసుకువెళ్తానని జడ్జి చెప్పారు. జిల్లా న్యాయ సేవాధికారి సంస్థలో పారా లీగల్ వలంటీర్లుగా నియమించడానికి విద్యావంతులైన ట్రాన్స్ జెండర్స్, సెక్స్ వర్కర్స్ నుంచి ఈ సందర్భంగా దరఖాస్తులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మంచాల రవీంద్ర, జ్యోత్స్న, శ్రీహరి, సుందరయ్య, రాములు, అనిత, ఉష తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సింధూజ

జనగామ: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న అతిథి అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సంఘం జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షురాలు గుడూరి సింధూజ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో ఆమె మాట్లాడుతూ అతిథి అధ్యాపకులు వేతనాలు రాక ఆర్థిక ఇబ్బందులతో మనోవేదనకు గురవుతున్నారని అన్నారు. ఎల్లారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న అతిథి అధ్యాపకురాలు రాధ బ్రెయిన్ స్ట్రోక్‌తో ఇబ్బంది పడుతూ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

స్టిక్కరింగ్ షురూ..

- మొదటి రోజు 59,616 ఇళ్లకు..
- ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్



స్టిక్కరింగ్‌పై సూచనలిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ: జిల్లాలో ఈనెల 9వ తేదీ నుంచి ప్రారంభం కానున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా బుధవారం ఇంటింటికీ స్టిక్కరింగ్ మొదలైంది. జిల్లాలో 1,62,512 గృహాలు ఉండగా మొదటి రోజు 59,616 ఇళ్లకు స్టిక్కర్లు వేశారు. ఈ ప్రక్రియ చేపట్టడానికి ఎన్యుమరేటర్లు ఉదయమే వార్డుల బాటపట్టగా.. సూపర్ వైజర్లు పర్యవేక్షించారు. మొదటిరోజు పలు చోట్ల ఎన్యుమరేటర్లు కొంత ఇబ్బంది పడగా.. మధ్యాహ్నం వరకు ప్రక్రియ వేగం పుంజుకుంది. గ్రామాలు, మున్సిపల్ వార్డుల పరిధిలో ఆయా రాజకీయ పార్టీల నాయకులు, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు ఎన్యుమరేటర్లకు సహకారం అందించారు. కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆధ్వర్యాన అదనపు కలెక్టర్లు పింకేష్‌కుమార్, రోహిత్‌సింగ్, జిల్లా స్థాయి ఉన్నతాధికారులు వసంత, సరిత, స్వరూప, రాము, రామారావు, రాణాప్రతాప్, రవీందర్, ఎంపీడీఓ, తహసీల్దార్లు, ఇతర అధికారులు, సిబ్బంది పరిశీలించారు.

ప్రజలు సహకరించాలి : కలెక్టర్

కుటుంబ సర్వే కోసం వచ్చే ఎన్యుమరేటర్లకు ప్రజలు సహకారం అందించి వివరాలు తెలియ జేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా కోరారు. జనగామ మున్సిపల్ పరిధి వీవర్స్‌కాలనీ, గిర్నిగడ్డ, కురుమవాడలో స్టిక్కరింగ్ ప్రక్రియను పరిశీలించిన ఆయన స్వయంగా పలు ఇళ్లకు స్టిక్కర్ అతికించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కుటుంబ సర్వేలో సేకరించిన వివరాలను గోప్యంగా ఉంచుతామని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈనెల 8వ తేదీ వరకు ప్రతీ ఇంటికి స్టిక్కర్ వేసి 9వ తేదీ నుంచి సర్వే ప్రారంభిస్తామని చెప్పారు. కలెక్టర్ వెంట స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

పాలకుర్తి టౌన్: కుల గణన సర్వేలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ రిజ్వాన్ బాషా హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలో ఇళ్లకు స్టిక్కరింగ్ చేసే ప్రక్రియను ఆయన పరిశీలించారు. సర్వేకు ఇద్దరు ఉపాధ్యాయులు హాజరుకాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్.. గైర్హాజరుపై వివరణ ఎందుకు తీసుకోలేదని ఎంపీడీఓను ప్రశ్నించారు. ఇళ్లకు అంటించిన స్టిక్కర్లపై క్రమ సంఖ్య లేకపోవడంపై ఎంపీడీఓ రాములు, ఎంపీఓ రవీందర్, పంచాయతీ కార్యదర్శి వెంకటాచారిపై కలెక్టర్ మండిపడ్డారు. షోకాజ్ నోటీసులు అందించాలని ఆదేశించారు. నంబర్ లేకుండా స్టిక్కర్ అంటించొద్దని సర్వే సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఇన్‌చార్జి ఆర్డీఓ కె.సుశీల, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంఈఓ పోతుగంటి నర్సయ్య, ఏఈఓ రాధిక, ఆర్‌ఐ రాకేష్ ఉన్నారు.

విజయం గుర్తింపు తెస్తుంది..



విజేతలతో ముఖ్యఅతిథి మల్లారెడ్డి, కోచ్‌లు, మేనేజర్లు

- సైక్లింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.మల్లారెడ్డి
- ముగిసిన అంతర్ జిల్లా రోడ్ సైక్లింగ్ చాంపియన్ షిప్ పోటీలు

లింగాలఘణపురం: విజయం క్రీడాకారుడి జీవితానికి ఎంతో గుర్తింపు తెస్తుందని సైక్లింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.మల్లారెడ్డి అన్నారు. రెండు రోజులుగా మండల కేంద్రంలో జరిగిన 9వ అంతర్ జిల్లా రోడ్ సైక్లింగ్ చాంపియన్ షిప్–2024 పోటీలు బుధవారం ముగిసాయి. వరంగల్ జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కైలాస్ యాదవ్ అధ్యక్షతన జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో మల్లారెడ్డి మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని.. స్ఫూర్తిగా తీసుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ పోటీలకు 380 మంది క్రీడాకారులు హాజరవడం అభినందనీయమన్నారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్‌కాంత్ మాట్లాడుతూ జిల్లాలో క్రీడల నిర్వహణకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో జనగామ డీవైఎస్‌ఓ వెంకట్‌రెడ్డి, అథ్లెటిక్ కమిటీ చైర్మన్ మాక్స్‌వెల్ ట్రావర్, జిల్లా అధ్యక్షుడు కుమార్, కార్యదర్శి కిషన్, సంతోష్, ఎస్సై శ్రావణ్‌కుమార్, మాజీ ఎంపీటీసీ భిక్షపతి, మార్కెట్ డైరెక్టర్ శ్రీలతారెడ్డి, నాయకులు రాజిరెడ్డి, వీరయ్య, మల్లేశం, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందిని పర్మనెంట్ చేయాలి

- యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు రాపర్తి రాజు
- కలెక్టరేట్ ఎదుట జీపీ కార్మికుల ధర్నా



కలెక్టరేట్ వద్ద మాట్లాడుతున్న రాపర్తి రాజు

జనగామ రూరల్: గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికులను పర్మనెంట్ చేయాలి.. వేతనాలకు ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి నెలనెలా సిబ్బంది అకౌంట్‌లో వేయాలని డిమాండ్ చేస్తూ గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు రాపర్తి రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు యూనియన్ ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద బుధవారం ధర్నా నిర్వహించిన అనంతరం కలెక్టర్ రిజ్వాన్ బాషాకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ వ్యవస్థ ఏర్పడి 60 సంవత్సరాలు గడిచినప్పటికీ సిబ్బందిని పర్మనెంట్ చేయకపోవడం పాలకుల దివాలాకోరు విధానాలకు నిదర్శనమన్నారు. ఈనెల 20వ తేదీలోపు రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి.. న్యాయమైన సమస్యలు పరిష్కరించాలి.. లేదంటే నిరవధిక సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మల్లాచారి, పి.మల్లేశం, ఎం.రామ్‌నారాయణ, డి.పాండురంగం, ఎ.వెంకట్‌రెడ్డి, ఐలయ్య, గుర్రపు లాజర్, సోమన్న, పరంజ్యోతి, వెంకటేశ్వర్లు, కృష్ణమూర్తి, జింక బాబు తదితరులు పాల్గొన్నారు.

తేమ సాకుతో తిరస్కరణ

- సీసీఐ కొనుగోలు కేంద్రం వద్ద రైతుల ఆందోళన



కొనుగోలు కేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

లింగాలఘణపురం: నెల్లుట్ల శివారు సత్యసాయి కాటన్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం నిర్వాహకులు బుధవారం తేమ అధికంగా ఉందంటూ పత్తి కొనుగోలుకు నిరాకరించడంతో రైతులు ఆందోళన చేపట్టారు. నిబంధనల ప్రకారం తేమ 12 శాతం లోపే ఉన్నప్పటికీ కొనుగోలు చేయకపోవడమే కాకుండా.. పత్తి తీసుకొచ్చిన వాహనాన్ని ఫొటో తీసి ఇతర మిల్లులకు షేర్ చేశారని.. అక్కడ కూడా కొనుగోలుకు నిరాకరించి ప్రైవేట్‌లో అమ్ముకునేలా చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో సంబంధిత కేంద్రం సిబ్బంది మిల్లు నుంచి బయటకు వెళ్లకుండా అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న కాటన్ పర్చేజింగ్ ఆఫీసర్ కె.నర్సిరెడ్డి, మార్కెట్ కార్యదర్శి శ్రీనివాసు, మార్కెట్ చైర్మన్ శివరాజ్‌యాదవ్ చేరుకుని రైతులతో మాట్లాడి నచ్చజెప్పారు. సీసీఐ తిరస్కరించిన పత్తిని ప్రైవేట్ వ్యాపారస్తుల వద్దకు తీసుకెళ్తే అడ్డగోలుగా ధర తగ్గించి రూ.6,200 నుంచి రూ.6000 వరకు అడుగుతున్నారని, దీంతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తున్నదని రైతులు వాపోయారు. దీంతో పత్తి నాణ్యతను బట్టి ధర నిర్ణయించి కొంత మంది రైతుల నుంచి కొనుగోలు చేశారు.

సీసీఐ కొనుగోలు చేయాలి



వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పత్తి కొంత నాణ్యత లేదని, ధర కొంత తగ్గించయినా సీసీఐ కొనుగోలు చేయాలి. ప్రైవేట్ వ్యాపారుల వద్దకు వెళితే రైతులను నిండా ముంచుతున్నారు.

\- గంగపురం నర్సింహులు, రైతు, కుందారం మాజీ సర్పంచ్

రూ.6,200 ధరకే అమ్ముకున్నా..



సీసీఐ కొనుగోలు కేంద్రం వద్దకు వెళ్తే తేమ ఎక్కువగా ఉందని కొనుగోలు చేయలేదు. ప్రైవేట్ వ్యాపారుల వద్దకు తీసుకెళ్తే క్వింటాకు రూ.6,200 ధర ఇచ్చారు. అందులో అన్‌లోడింగ్ చార్జీలు, కమీషన్ పేరుతో మరింత కోత పెట్టారు.

\- చిర్ర వీరస్వామి, కుందారం

నిబంధనల మేరకు కొనుగోలు చేస్తాం..

నిబంధనల మేరకు పత్తి కొనుగోలు చేస్తాం. రైతులు ఇబ్బందులకు గురి చేయొద్దు. నాణ్యమైన పత్తికి గిట్టుబాటు ధర లభిస్తుంది. ఆందోళనలు చేస్తే రైతులకు నష్టం జరుగుతుంది. తేమ, నాణ్యత ప్రమాణాలు పాటించి పత్తి తేవాలి.

\- కె.నర్సిరెడ్డి, కాటన్ పర్చేజింగ్ ఆఫీసర్, జనగామ

క్లుప్తంగా

వారంలోగా సీసీఐ కేంద్రాల్లో పత్తి కొనుగోళ్లు

● ఏఎంసీ పరిధిలో 21 కేంద్రాలు

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసీ)పరిధిలో మొదటి విడత నోటిఫై చేసిన సీసీఐ కొనుగోలు(జిన్నింగ్ మిల్లులు)కేంద్రాల్లో వారంలోగా పూర్తిస్థాయిలో పత్తి కొనుగోళ్ల ప్రారంభం అవుతాయని మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి నిర్మల తెలిపారు. వరంగల్ ఏఎంసీ పరిధిలో మొత్తం 21 సీసీఐ కొనుగోలు కేంద్రాలు(జిన్నింగ్ మిల్లులు) ఏర్పాటయ్యాయి. కాగా, అందులో మొదటి విడతగా 15కేంద్రాలను అధికారులు నోటిఫై చేశారు. అందులో ఇప్పటికే 10 సీసీఐ కేంద్రాల్లో పత్తి కొనుగోళ్లు ప్రారంభం అయ్యాయి. కాగా బుధవారం మరో 5 కేంద్రాలు ప్రారంభం అయినట్లు కార్యదర్శి తెలిపారు. ప్రస్తుతం వస్తున్న పత్తిలో తేమ శాతం తక్కువగా నమోదు అవడం శుభపరిణామం అని పత్తి రాక పెరిగితే మరో వారం రోజుల్లో మిగిలిన ఆరు కేంద్రాల్లో కొనుగోళ్లు ప్రారంభం జరిగితే మార్కెట్ పరిధిలోని అన్ని కేంద్రాల్లో పత్తి కొనుగోళ్లు చేస్తారని తెలిపారు. కార్యదర్శి వెంట గ్రేడ్-2 కార్యదర్శి ఎస్.రాము తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

● నిట్ ప్రొఫెసర్ సురేశ్‌బాబు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ సురేశ్‌బాబు

హసన్‌పర్తి: విద్యార్థులు విషయ, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని నిట్ ప్రొఫెసర్ ఎరుకల సురేశ్‌బాబు అన్నారు. ఎస్సార్ యూనివర్సిటీ ప్రాంగణంలోని సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న సాంకేతిక, సంస్కృతి కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ సురేశ్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జీపీటీ (చాట్), ఏఐ(కృత్రిమ మేథస్సు) ప్రాముఖ్యతను తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశ్రీరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇన్నో విజన్–2024 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమాల్లో భాగంగా తొలి రోజు ఆధునిక టెక్నాలజీ సరికొత్త విధానాలు, నూతన ఆవిష్కరణలు వాటి వల్ల సమాజంలో సమస్యల పరిష్కారంపై పేపర్ ప్రజెంటేషన్ చేశారు. టెక్నికల్ క్విజ్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, డిబేట్ తదితర అంశాలపై పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ సుదర్శన్, డాక్టర్ మహేందర్, డాక్టర్ శ్రీవాణి, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ వేదిక, ఝాన్సీ, శ్వేత పాల్గొన్నారు.

అగ్రిమెంట్‌కు మించి..

టీజీ ఎన్పీడీసీఎల్ బిల్లుల చెల్లింపులో అక్రమాలు
- మహబూబాబాద్ డివిజన్‌లో వెలుగులోకి..
- పెద్ద ఎత్తున అవకతవకలు జరిగినట్లు ప్రచారం
- ఆడిటర్‌కు ఉద్యోగి బెదిరింపులు



హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్‌లో అక్రమాలు, అవకతవకల పరంపర కొనసాగుతోంది. ఒక చోట కాకుంటే మరో చోట అవకతవకలు, అక్రమాలు వెలుగుచూస్తున్నాయి. మరోవైపు ఏసీబీ దాడులు జరుగుతున్నా.. ఏ మాత్రం భయం లేకుండా పలువురు తమ అక్రమాలు, అక్రమ సంపాదన కొనసాగిస్తూ పని చేస్తున్న సంస్థకు చెడ్డపేరు తీసుకొస్తున్నారు. ఈ శాఖ ఉద్యోగులకు అత్యధిక వేతనాలున్నా.. అక్రమాలు, అక్రమ సంపాదనను మాత్రం వీడడం లేదనే విమర్శలున్నాయి. తాజాగా ఎన్పీడీసీఎల్ మహబూబాబాద్ డివిజన్ కార్యాలయంలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగినట్లు ఆడిట్ పరిశీలనలో వెలుగు చూసినట్లు విద్యుత్ ఉద్యోగవర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అక్రమాలు, అవకతవకలకు పాల్పడిన ఓ ఉద్యోగి ఏకంగా ఆడిట్ అధికారిని బెదిరించినట్లు ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. ప్రతి ఏటా విద్యుత్ కార్యాలయాల్లో ఆడిట్ జరుగుతుంది. ఇదే క్రమంలో ఇటీవల ఎన్పీడీసీఎల్ మహబూబాబాద్ డివిజన్ కార్యాలయంలో ఆడిట్ అధికారి ఆడిట్ నిర్వహించారు. ఈ ఆడిట్‌లో డివిజన్ కార్యాలయంలో జరిగిన అక్రమాలు వెలుగు చూడగా నివేదికను ప్రధాన కార్యాలయానికి పంపినట్లు సమాచారం. ఈ సమాచారం తెలుసుకున్న అక్రమాలకు బాధ్యుడైన ఉద్యోగి.. ఆడిట్ నివేదికను ఎలా పంపుతావని దూషించడంతోపాటు, బెదిరింపులకు పాల్పడినట్లు ఉద్యోగ వర్గాల్లో ప్రచారం జరుగుతుంది.

బిల్లులు చెల్లింపులో చేతివాటం

మహబూబాబాద్ డివిజన్‌లో విద్యుత్ అభివృద్ధి పనుల బిల్లుల చెల్లింపులో చేతివాటం ప్రదర్శించినట్లు తెలుస్తోంది. ప్రతి అభివృద్ధి పనికి అంచనాలు తయారు చేసి ఆ మేరకు పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ అగ్రిమెంట్ చేసుకుంటారు. పని పూర్తయిన తర్వాత సంబంధిత ఏఈ మెజర్‌మెంట్ బుక్ (ఎంబీ)లో పనుల వివరాలు నమోదు చేస్తారు. ఏఈ చేసిన ఎంబీ రికార్డును ఏడీ పరిశీలించి చెక్ మేజర్ చేస్తారు. అనంతరం సాప్‌లో ఎంటర్ చేస్తారు. తర్వాత డివిజనల్ కార్యాలయంలో సాప్ నుంచి ఎంబీ రికార్డును తీసుకుని కాంట్రాక్టర్ చెల్లించాల్సిన బిల్లును రిలీజ్ చేస్తారు. బిల్లు కూడా అగ్రిమెంట్‌లో ఉన్న మేరకు చెల్లించాల్సి ఉండగా మహబూబాబాద్ డివిజన్‌లో అదనంగా చెల్లింపులు చేసినట్లు ఆడిట్ నివేదికలో వెలుగు చూసింది. అగ్రిమెంట్ చేసుకున్న పనికి మించి అదనంగా బిల్లు పెరిగితే రివైజ్డ్ ఎస్టిమేషన్ వేసుకుని రీ అగ్రిమెంట్ చేసుకుని చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. ఇవేమీ పట్టించుకోకుండా బిల్లులు చెల్లింపు చేసే ఉద్యోగి ఇష్టానుసారంగా కాంట్రాక్టర్లకు చెల్లింపులు చేశారు. తద్వారా ఎన్పీడీసీఎల్ కంపెనీకి నష్టం చేకూర్చారు. కాంట్రాక్టర్ ఇచ్చే అధిక పర్సంటేజీలు ఆశించి అదనపు చెల్లింపులు చేసినట్లు విద్యుత్ ఉద్యోగుల్లో ప్రచారం జరుగుతోంది. నెలల తరబడి అక్రమాలు, అవకతవకల పరంపర కొనసాగుతూ సొంత సంస్థకు కన్నం వేస్తున్నా.. నిధుల దుర్వినియోగం జరుగుతున్నా.. ఆ డివిజన్ బాస్ ఏం చేస్తున్నారనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఇందులో డివిజన్ బాస్ పాత్ర కూడా ఏమైనా ఉందా..? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సమగ్ర విచారణ జరిపితే ఎంత మొత్తంలో నిధులు దుర్వినియోగమయ్యాయో తేలుతుందని ఎన్పీడీసీఎల్ ఉద్యోగ వర్గాల అభిప్రాయం.

టీచర్లు, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి

● పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పింగిళి శ్రీపాల్‌రెడ్డి

విద్యారణ్యపురి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపిస్తే టీచర్లు, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ తెలంగాణ (పీఆర్‌టీయూటీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు, వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. హనుమకొండలోని పీఆర్‌టీయూ భవనంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడిగా టీచర్ల సమస్యల పరిష్కారానికి, బదిలీలు, పదోన్నతుల ప్రక్రియకు కృషిచేసినట్లు వెల్లడించారు. వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపిస్తే సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ స్కీం పునరుద్దరణకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. వివిధ యాజమాన్యాల్లోని టీచర్లకు హెల్త్‌కార్డుల అమలుకు కృషిచేస్తానన్నారు. పీఆర్‌టీయూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో పీఆర్‌టీయూ ముందంజలో ఉందన్నారు. సమావేశంలో పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పుల్లం దామోదర్‌రెడ్డి, బీరెల్లి కమలాకర్‌రావు, గుండు లక్ష్మణ్, వెంకటరెడ్డి, రాఘవరెడ్డి, తిరుపతిరెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీహరి, గఫార్, తిరునగరి, శ్రీనివాస్, సూరిబాబు, రఘు, చల్లా రాజిరెడ్డి, విజయ్‌కుమార్ సురేందర్, మహేందర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి ఉన్నారు.

హోరాహోరీగా అండర్‌-23 క్రికెట్ పోటీలు

● సెమీస్‌కు చేరిన ఖమ్మం, ఆదిలాబాద్ జట్లు


సెమీస్‌కు చేరిన ఆదిలాబాద్ జట్టు

వరంగల్ స్పోర్ట్స్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా కొనసాగుతున్న అండర్–23 లీగ్ కమ్ నాకౌట్ అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు బుధవారం హోరాహోరీగా సాగాయి. వరంగల్, మెదక్ జిల్లా కేంద్రంగా జరుగుతున్న ఈ పోటీల్లో పూల్ బీ విభాగంలో మూడు మ్యాచ్‌లు గెలిచిన ఖమ్మం జట్టు, రెండు మ్యాచ్‌లు గెలిచిన ఆదిలాబాద్ జట్టు సెమీ ఫైనల్‌కు చేరుకున్నాయి. ఈ రెండు జట్లు ఈ నెల 8 నుంచి మెదక్‌లో నిర్వహించనున్న సెమీస్‌లో పాల్గొంటాయని వరంగల్ క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు.

మూడో రోజు హనుమకొండ రెడ్డిపురంలోని టీవీవీఎస్ క్రికెట్ మైదానంలో ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల మధ్య జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఆదిలాబాద్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుని నిర్ణీత 50 ఓవర్లలో 46.4 ఓవర్లను ఎదుర్కొని 132 పరుగుల వద్ద ఆల్ అవుట్ అయింది. అనంతరం బ్యాటింగ్ బరిలోకి దిగిన వరంగల్ జట్టు 20.5 ఓవర్లను ఆడి 98 పరుగుల వద్ద అన్ని వికెట్లను కోల్పోయి ఓటమి చవిచూసింది.

మొగిలిచర్ల క్రీడామైదానంలో జరిగిన మరో లీగ్ మ్యాచ్‌లో ఖమ్మం, మహబూబ్‌నగర్ జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన ఖమ్మం జట్టు 41.3 ఓవర్లు ఎదుర్కొని 208 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ బరిలో దిగిన మహబూబ్‌నగర్ జట్టు మొదట్లోనే బ్యాటింగ్ ఆర్డర్ విఫలం కావడంతో 37.3 ఓవర్ల వద్ద 143 పరుగులను సాధించి ఆల్ అవుట్ అయింది.

మట్టి పరీక్ష తప్పనిసరి చేయించాలి

● కేవీకే శాస్త్రవేత్త రాజన్న



మట్టి పరీక్షల పత్రాలను అందజేస్తున్న కేవీకే శాస్త్రవేత్త సౌమ్య

మామునూరు: రైతులు తమ పొలాల్లో మట్టి పరీక్షలు నిర్వహించి, ఆ ఫలితాలతోనే ఎరువులను వినియోగించాలని కేవీకే శాస్త్రవేత్త రాజన్న సూచించారు. ఈమేరకు బుధవారం వరంగల్ జిల్లాలోని దత్తత గ్రామాల్లో వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ సీ.హెచ్ సౌమ్య ఆధ్వర్యంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు పర్యటించారు. షెడ్యూల్డ్ తెగల ఉప ప్రణాళికలో పరీక్షించిన మట్టి నమూనా ఫలితాల పత్రాలను 50 మంది మిర్చి రైతులకు అందజేశారు. ఈసందర్భంగా కేవీకే అధిపతి రాజన్న మాట్లాడుతూ.. మట్టి నమూనా పత్రాల్లో సూచించిన వివరాల ప్రకారం ఎక్కువ మూలకం స్థాయి ఉంటే ఎరువుల వినియోగం 25శాతం పెంచాలని, మధ్యస్థ మూలకం విలువలు కలిగి ఉంటే ప్రతిపాదిత ఎరువుల మోతాదులను మొక్కలకు అందించాలని సూచించారు. మిరప పంట ఎండు తెగులు, పుచ్చు తెగులు నివారణ చర్యలను గమనించడం ట్రైకోడర్మ పిచికారీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మత్స్య శాస్త్రవేత్త గణేశ్, డాక్టర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

మణుగూరు టు బెల్గావి ప్రత్యేక రైలు పునఃప్రారంభం

కాశిబుగ్గ: పండుగల సీజన్ నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే పలు ప్రత్యేక రైళ్లను బుధవారం ప్రారంభించింది. వాటిలో గత ఏడాది నిలిపివేసిన మణుగూరు టు బెల్గావి స్పెషల్ (07335, 07336) రైలు బుధవారం నుంచి పునఃప్రారంభమైనట్లు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈరైలు ఉదయం 7.48 గంటలకు వరంగల్ చేరుకుని కేసముద్రం, మహబూబాబాద్, డోర్నకల్, గాంధీపురం, భద్రాచలం రోడ్డు స్టేషన్లలో ఆగుతూ 12.50కి మణుగూరు చేరుకుంటుంది. తిరిగి 3.40కి మణుగూరులో ప్రారంభమై ఆయా స్టేషన్లలో ఆగుతూ సాయంత్రం 7.28కి వరంగల్‌కు, 10.10కి సికింద్రాబాద్‌కి మరుసటి రోజు సాయంత్రం 4 గంటలకు బెల్గావి చేరుకుంటుంది.

ఉన్నది నలుగురు విద్యార్థులు.. వచ్చేది ఒక్కరు

● ఇద్దరు ఉపాధ్యాయుల్లో ఒకరి డిప్యుటేషన్

బయ్యారం: మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోని జగ్నాతండా ప్రాథమిక పాఠశాలలో నలుగురు విద్యార్థులు నమోదు కాగా, రెగ్యులర్‌గా వచ్చేది ఒక్కరే విద్యార్థి. ఆ విద్యార్థికి ఇద్దరు ఉపాధ్యాయులు ఉండగా గత మంగళవారం ఒక్కరు కూడా హాజరుకాకపోవడంతో సాక్షి దినపత్రిక ప్రధాన సంచికలో 'సార్ ప్రజెంట్.. స్టూడెంట్ ఆబ్సెంట్' అనే శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనికి విద్యాశాఖ అధికారులు స్పందించారు. బుధవారం ఎంఈఓ దేవేంద్రాచారి పాఠశాలను సందర్శించారు. వీరిలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న శ్రీనివాస్‌ను డిప్యుటేషన్‌పై మండలంలోని వినోభానగర్ పాఠశాలకు పంపించడం గమనార్హం.

నీటితొట్టిలో పడి వృద్ధురాలి మృతి

డోర్నకల్: మానుకోట జిల్లా డోర్నకల్ మండలంలోని తహసీల్దారు బంజర గ్రామానికి చెందిన వృద్ధురాలు బుధవారం ప్రమాదవశాత్తు నీటితొట్టిలో పడి మృతి చెందింది. డోర్నకల్ ఏఎస్సై మజీద్ తెలిపిన వివరాల ప్రకారం.. తహసీల్దారు బంజరకు చెందిన వలిశెట్టి వీరమ్మ(85) తన భర్త చనిపోవడంతో కోడలు రమణమ్మ వద్ద ఉంటుంది. రమణమ్మ ఇంటి ఎదురుగా వీరమ్మ సోదరి సుంకరి నాగమ్మ నివాసం ఉంటూ పనినిమిత్తం బయటకు వెళ్తూ తన ఇంటిని గమనించాలని కోరింది. ఈ క్రమంలో నాగమ్మ ఇంటిని పరిశీలించేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు ఇంటి ఆవరణలోని నీటితొట్టిలో పడింది. అత్త వీరమ్మ కనిపించకపోవడంతో వెతుకుతున్న రమణమ్మకు నీటితొట్టిలో కనిపించింది. చుట్టుపక్కల వారిని పిలిచి చూసేలోగా వీరమ్మ అప్పటికే మృతి చెంది ఉంది. మృతురాలి కుమార్తె సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

విషజ్వరంతో బాలుడు..

నర్సంపేట రూరల్ : విషజ్వరంతో బాలుడు మృతి చెందిన ఘటన చంద్రయ్యపల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా నర్సంపేట మండలం చంద్రయ్యపల్లికి చెందిన బాషబోయిన తిరుపతి–రజిత దంపతుల ద్వితీయ పుత్రుడు మహేందర్(13) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో నర్సంపేట పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు వరంగల్‌లోని మరో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

శ్మశానవాటిక అన్యాక్రాంతం!

- సమాధులపై మట్టి పోసిన కాంట్రాక్టర్
- ఆనవాళ్లు కోల్పోతున్న వైకుంఠధామం
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

హన్మకొండ చౌరస్తా: కాదేది కబ్జాకు అనర్హం అన్నట్లుగా ఉంది ప్రస్తుత పరిస్థితి. చెరువులు, కుంటలు, అడవులు చివరికి శ్మశానాలనూ వదిలిపెట్టడం లేదు. నగర నడిబొడ్డున ఉన్న శ్మశానవాటికపై కొందరు కన్నేశారు. సమాధుల ఆనవాళ్లు కనిపించకుండా చేశారు. ఓ కాంట్రాక్టర్ శ్మశాన వాటికలో మట్టి పోసి ఆనవాళ్లు కనిపించకుండా చేశాడు. ఈ ఘటన జరిగి మూడేళ్లవుతున్నా.. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నగర నడిబొడ్డున..

హనుమకొండ 9వ డివిజన్ కాకతీయ కాలనీలో సంగీత్ హోటల్ నుంచి పెద్దమ్మగడ్డకు వెళ్తుంటే.. గంగా గార్డెన్ ప్రహరీకి ఆనుకుని శ్మశాన వాటిక ఉండేది. మూడేళ్ల క్రితం వరకు శ్మశానవాటిక ఆనవాళ్లు కనిపించేవి. చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన పలువురి సమాధులు, అంత్యక్రియల అనంతరం స్నానం చేసేందుకు చేతిపంపు సైతం ఉండేది. సర్వే నంబర్ 13, 14లో సుమారు 10 గుంటల స్థలంలో 4, 9, 10 డివిజన్లకు చెందిన వడ్డెర, సిక్కు, మాదిగ, మాల కులాలకు చెందిన వారు తరతరాలుగా ఎవరు చనిపోయినా ఇక్కడే అంత్యక్రియలు చేసేవారు. కొన్నేళ్ల క్రితం ఈస్థలం తమదేనంటూ కొందరు రాగా.. ఆ నాలుగు కులాలకు చెందిన పెద్దలు గుంటకు రూ.30 వేలు వెచ్చించి 2002లో శ్మశానవాటిక స్థలాన్ని కొన్నట్లు స్థానికులు చెబుతున్నారు.


మట్టిపోసి ఆనవాళ్లు లేకుండాఉన్న శ్మశానవాటిక


శ్మశానవాటిక లోపలికి వెళ్లకుండా కాలువ తీసి వదిలేసిన కాంట్రాక్టర్

మట్టితో పూడ్చి..

మూడేళ్ల క్రితం శ్మశానవాటికను ఆనుకుని ఉన్న నాలాపై బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఆ సమయంలో తవ్వకాల్లో బయటపడిన మట్టి, ఇతర వ్యర్థాలను సదరు కాంట్రాక్టర్ సమాధులపై పోశాడు. ప్రస్తుతం ఆ స్థలంలో మొక్కలు మొలుస్తున్నాయి. మరికొద్ది రోజులైతే సమాధుల ఆనవాళ్లు కూడా కనిపించకుండా పోయే పరిస్థితి ఉంది. కాగా.. కబ్జా చేయాలనే ఆలోచనతోనే సమాధులను పూడ్చివేయించినట్లు ఆరోపణలున్నాయి.

చాలాసార్లు ఫిర్యాదు చేశాం..



“ మూడు డివిజన్లు, నాలుగు కులాలకు చెందిన శ్మశాన వాటికను మట్టితో పూడ్చివేయడం బాధాకరం. మూడేళ్లలో అనేక సార్లు ఫిర్యాదు చేసినా మున్సిపల్ అధికారులు పట్టించుకోలేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవడంతో పాటు శ్మశానవాటికను అభివృద్ధి చేయాలి.

- సర్దార్ దర్శన్‌సింగ్, రాష్ట్ర మైనార్టీ కమిషన్ సభ్యుడు

2002 లో కొనుగోలు చేశాం..



మా తాతలు, వారి తండ్రుల నుంచి గంగా గార్డెన్ పక్కన గల శ్మశానవాటికలోనే అంతక్రియలు చేస్తున్నాం. ఈ స్థలం తమదేనంటూ కొందరు వస్తే సుమారు 10 గుంటల స్థలాన్ని 2002లో అందరి భాగస్వామ్యంతో కొనుగోలు చేశాం. మూడేళ్ల క్రితం పక్కనే బ్రిడ్జి నిర్మాణం చేసిన కాంట్రాక్టర్ మట్టిని తెచ్చి శ్మశానవాటికలో నింపాడు. ఇదేంటని అడిగితే మళ్లీ చదును చేస్తా అని చెప్పి దాటవేశాడు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకుని శ్మశానవాటికను పరిరక్షించాలి.

- పల్లెపు శ్రీను, కాకతీయకాలనీ

ఆగి ఉన్న డీసీఎంను ఢీకొట్టిన బైక్

● ఒకరి మృతి, మరొకరికి గాయాలు


అర్షం రాజేశ్ (ఫైల్)

నల్లబెల్లి: ఆగిఉన్న డీసీఎం వాహనానికి వెనుకనుంచి ఢీకొట్టిన బైక్‌పై ప్రయాణిస్తున్న వారిలో ఒకరు మృతి చెందగా.. మరొకరు గాయపడిన ఘటన వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని బోల్లోనిపల్లి మూలమలుపు వద్ద జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎస్సై ప్రశాంత్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. దుగ్గొండి మండలం మల్లంపల్లి గ్రామానికి చెందిన అర్షం రాజేశ్(27), శాయంపేట మండలంలోని నేరేడుపల్లి గ్రామానికి చెందిన మంద సాయిరాం(సిద్దు) ద్విచక్ర వాహనంపై సమీప బంధువు పెళ్లి పత్రికలు పంపిణీ చేసి మంగళవారం రాత్రి ఇంటికి వస్తున్నారు. ఈక్రమంలో బోల్లోనిపల్లి మూలమలుపువద్ద జాతీయ రహదారిపై నిర్లక్ష్యంగా నిలిపి ఉంచిన డీసీఎం వాహనాన్ని వీరు ద్విచక్రవాహనంతో వెనుకనుంచి ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో రాజేశ్ అక్కడికక్కడే మృతి చెందగా, సాయిరాం(సిద్దు) తీవ్ర గాయాలతో స్పృహకోల్పోయాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సాయిరాంను ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు రాకేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వాకర్..


ఎల్లయ్య (ఫైల్)

రఘునాథపల్లి: రోడ్డు ప్రమాదంలో వాకర్ దుర్మరణం చెందిన ఘటన హనుమకొండ–హైదరాబాద్ జాతీయ రహదారిపై రఘునాథపల్లి వద్ద బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. జనగామ జిల్లా రఘునాథపల్లి మండల కేంద్రానికి చెందిన చింతకింది ఎల్లయ్య (60) బుధవారం ఉదయం జాతీయ రహదారిలోని సర్వీస్ రోడ్డు గుండా భారత్ గ్యాస్ ఆఫీస్ సమీపంలో వాకింగ్ చేస్తున్నాడు. ఈక్రమంలో జనగామ నుంచి హనుమకొండ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన ఎల్లయ్యను కుటుంబ సభ్యులు 108లో జనగామ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎల్లయ్యకు భార్య వరమ్మతోపాటు నలుగురు కుమారులు, కుమార్తె ఉన్నారు. కాగా, మృతికి కారణమైన గుర్తు తెలియని వాహనం కోసం పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

జమిలి ఎన్నికలు నిర్వహించడం సాధ్యం కాదు

● సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

ఎల్కతుర్తి: జమిలి ఎన్నికలు నిర్వహించడం మన దేశంలో సాధ్యం కాదని విభిన్న సంస్కృతిలో విభిన్న భాషలు కలిగిన రాష్ట్రాలు ఉన్న దేశం మనదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల్లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారతదేశంలోని రాష్ట్రాలు విభిన్న భాషలు, సంస్కృతులు కలిగిన ప్రాంతాలుగా విరాజిల్లుతున్నాయన్నారు. ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం సాధ్యం కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం నియంత పోకడలా వ్యవహరించడం సరికాదని హితవుపలికారు. కేంద్రంలో కొనసాగుతున్న ఎన్డీఏ ప్రభుత్వం ప్రజల సంక్షేమం మరిచి కార్పొరేట్ రంగానికి పెద్దపీట వేస్తుందని ధ్వజమెత్తారు. వ్యవసాయ రంగానికి సబ్సిడీ ఎత్తివేసి రైతుల రెట్టింపు ఆదాయాన్ని పక్కకు నెట్టారని మండిపడ్డారు. వ్యవసాయంలో నల్లచట్టాలను తీసుకొచ్చి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రైతులు తిరుగబడే రోజులు రావడంతో ప్రభుత్వం వెనక్కు తగ్గిందని, ప్రజా సమస్యల కోసం ప్రజా పోరాటాలే శరణ్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలో పేదలు గుడిసెలు వేసుకున్న స్థలాల్లో పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, ప్రజలకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలని అన్నారు. సమావేశంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు, జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆదరి శ్రీనివాస్, మంచాల రమాదేవి, తిరుపతి, రమేశ్, కృష్ణారెడి పాల్గొన్నారు.

సంబురంగా సదర్ ఉత్సవం

● దున్నపోతుల విన్యాసాలు.. కిక్కిరిసిన గోకుల్‌నగర్ జంక్షన్


మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, వేదికపై ఎంపీ కావ్య, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, తదితరులు

హన్మకొండ చౌరస్తా: హనుమకొండలోని గోకుల్‌నగర్ జంక్షన్‌లో బుధవారం రాత్రి సదర్ ఉత్సవాలు సంబురంగా జరిగాయి. రెండు గంటలపాటు సాగిన సదర్‌లో దున్నపోతుల విన్యాసాలు అబ్బురపరిచాయి. అంతకుముందు జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భగవాన్ శ్రీకృష్ణుడి అంశలో పుట్టిన యాదవులు అన్ని కులాల ప్రజలు, పశువులతో మెదిలే ప్రేమపూర్వక బంధాలకు చిహ్నమే సదర్ ఉత్సవమన్నారు. మొదటిసారిగా వరంగల్‌లో నిర్వహిస్తున్న సదర్ వేడుకలకు ఇంత పెద్ద సంఖ్యలో హాజరు కావడం సంతోషంగా ఉందన్నారు. వచ్చే ఏడాది ఈ స్థలం సరిపోదని, ఆర్ట్స్ కాలేజీలో నిర్వహించుకుందామని అన్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చే ఏడాది సదర్ ఉత్సవాలను మరింత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తామని అన్నారు. ఎంపీ కావ్య మాట్లాడుతూ దసరా, దీపావళి పర్వదినాల మాదిరిగా సదర్ ఉత్సవాన్ని ప్రతీ ఏటా నిర్వహించుకుందామన్నారు. కాగా, ఓ యువకుడు అత్యుత్సాహంతో స్టేజీపైకి వెళ్లేందుకు ప్రయత్నించగా అక్కడే ఉన్న పోలీసులు అతడిని బయటకి పంపించారు. ఈ క్రమంలో స్వల్పతోపులాట జరిగింది. పోలీసులు అప్రమత్తమై ఎలాంటి ఘటనలు జరగకుండా చూశారు.


తోపులాటను అదుపుచేస్తున్న పోలీసులు

నా భర్తను బతికించండి..

- ఇంటిపై నుంచి పడి తీవ్రంగా గాయపడిన వ్యక్తి
- చికిత్సకు రూ.లక్షల్లో ఖర్చు
- సాయమందించాలని భార్య వేడుకోలు

దీన గాథ


చికిత్స పొందుతున్న సామల కుమార్

స్టేషన్‌ఘన్‌పూర్: ఇంటిపై నుంచి పడి ప్రాణాపాయస్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తన భర్తను బతికించుకునేందుకు సాయం అందించాలని భార్య వేడుకోంటుంది. వివరాలిలా ఉన్నాయి.. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని పాంనూర్ గ్రామానికి చెందిన సామల కుమార్ ఇటీవల దీపావళి పండుగ రోజున ప్రమాదవశాత్తు తమ ఇంటిపై నుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన కుమార్ వైద్య ఖర్చులకు ఇప్పటికే అతడి భార్య కృష్ణవేణి బంగారు నగలు అమ్మి దాదాపు రూ.3లక్షల వరకు వెచ్చించింది. ఇద్దరు ఆడపిల్లలు ఉన్న సదరు నిరుపేద వివాహిత ఇకపై ఖర్చులు భరించలేని స్థితిలో దాతల సాయం కోసం ఎదురుచూస్తుంది. దాతలు సహకరించాలని, వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం చేయాలని కోరుతోంది.

దాతలు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: 93968 60007, 97010 23694